TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:73 THURSDAY ,JULY 23,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 73 గురువారం 23 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-



# నన్ను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, బీజేపీల కుట్ర

## కొడంగల్‌లో రేవంత్ రెడ్డి

- కొడంగల్ లో ఎస్ఐఆర్ ఫారమ్ స్వయంగా నింపిన రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌కు ఓటేసిన వారి ఓట్లను తొలగించే ప్రక్రియలో బీఆర్ఎస్, బీజేపీ ఉన్నాయని విమర్శ
- కుట్రదారులకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపు

హంసకలం వార్త : బీఆర్ఎస్, బీజేపీల తప్పులను ప్రశ్నిస్తున్నందుకే తనను రాజకీయంగా దెబ్బతీయడానికి ఆ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆయన, తన ఫారమ్‌ను స్వయంగా నింపి అధికారులకు అందజేశారు. బూత్ లెవల్ ఏజెంట్లతో మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలు పైకి వేరువేరుగా కనిపించినా, ఆ పార్టీల లక్ష్యం మాత్రం ఒకటేనని ఆరోపించారు. మిగతా2లో



## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ



## సెల్ఫీల మోజులో ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు

- ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీతక్క
- ములుగు జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు మంత్రి సూచనలు
- జలపాతాల వద్ద బ్యారికేడ్లను దాటవద్దని హెచ్చరిక

హంసకలం వార్త: తెలంగాణలోని ములుగు జిల్లా ప్రకృతి రమణీయతను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆమె, అక్కడి నుంచే పర్యాటకుల భద్రతను మిగతా2లో

## లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదు.. దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం

హంసకలం వార్త

అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను ఆ పార్టీ నాయకులు అమ్ముకుని.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ..మిగతా2లో

## 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

- 7.5 కోట్ల విద్యార్థులు ప్రభావితమయ్యారని వ్యాఖ్య
- ఒక్క కేసులోనూ శిక్ష పడలేదని విమర్శ
- విద్యార్థుల డిమాండ్లు సమంజసమేనంటూ మద్దతు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్



హంసకలం వార్త: నీట్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో 152 ప్రశ్నపత్రాల లీకులు జరిగాయని, దీంతో 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరికీ మిగతా2లో



## బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్

- కరీంనగర్‌లోని బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ యత్నం
- హైదరాబాద్ లో గాంధీ భవన్ ను ముట్టించేందుకు బీజేపీ శ్రేణుల యత్నం

## రాష్ట్రంలో సమృద్ధి వర్షాల కోసం కొత్తకొండలో వరుణయాగం



### భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

హంసకలం వార్త :

హనుమకొండ జిల్లా కొత్తకొండలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వరుణయాగం, 2లో



## విద్యార్థులు, రాహుల్‌కు మద్దతుగా ప్రతి రోజు నిరసనలు

హంసకలం వార్త :మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. మిగతా2లో

## ప్రభుత్వ విప్‌లకు మంత్రి హోదా..


-ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను
-విప్‌లుగా నియమించిన ప్రభుత్వం
ముగ్గురికి ప్రభుత్వ విప్‌లకు మంత్రి హోదా
-విజయ రమణారావు, శ్రీనివాస్ రెడ్డి, వీరేశంలకు దక్కిన గౌరవం
-స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్ ప్రకారం ప్రోటోకాల్ సౌకర్యాలు
-పదవిలో ఉన్నంతవరకే హోదా వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టీకరణ

హంసకలం వార్త: తెలంగాణలో శాసనసభా వ్యవహారాలను మరింత సమర్థవంతంగా నిర్వహించే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు ప్రముఖ ఎమ్మెల్యేలను ప్రభుత్వ విప్‌లుగా నియమించడమే కాకుండా, వారికి రాష్ట్ర మంత్రి హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మిగతా2లో

## గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

- ఆదాయం కుటుంబ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన
- వీరంతా నిరసనబాట పట్టే అవకాశం ఉందని హెచ్చరిక



హంసకలం వార్త: స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని 2లో

## ట్రాన్స్‌కో డీఈ ఇంట్లో ఏసీబీ దాడులు..

-ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు
-ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై సోదాలు
-హైదరాబాద్‌తో పాటు 14 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
-8 ప్రత్యేక బృందాలతో కొనసాగుతున్న సోదాలు
-ఆస్తులు, బ్యాంకు లావాదేవీల పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

## తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్ న్యూస్




-రబీకి సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు ఆమోదం
-సేకరించే ధాన్యం 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు
-ప్రధాని మోదీకి కృతజ్ఞత తెలిపిన కేంద్రమంత్రులు

2

తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో అదనపు పరిమాణంలో వరి ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

# లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదు.. దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం

ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. జదీూజులో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

# 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

వారి కుటుంబాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన రాహుల్, ప్రశ్నపత్రాల లీక్‌లపై నిరసన తెలుపుతున్న విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా సమంజసమైనవేనన్నారు. వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం బలప్రయోగానికి దిగుతోందని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, అసమర్థుడని విమర్శిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మూడు ప్రధాన డిమాండ్లను కేంద్రం ముందు ఉంచారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ మొత్తం వ్యవహారంపై ప్రధానమంత్రి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి, కుటుంబాలు రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రశ్నపత్రాల లీక్‌ల కారణంగా వారి భవిష్యత్తు దెబ్బతింటోందని రాహుల్ అన్నారు. ఈ పరిస్థితుల్లో సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు నష్టపోతుండగా, ప్రత్యేక అవకాశాలు ఉన్నవారికే ప్రయోజనం చేకూరుతోందని ఆరోపించారు.

# తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్ న్యూస్

తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో అదనపు పరిమాణంలో వరి ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం, మొత్తం సేకరణ పరిమితిని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ధాన్యం కొనుగోలు కోటాను పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, ధాన్యం నిల్వ, రవాణా పరంగా ఎదురయ్యే సవాళ్లు కూడా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు. వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ కీలక రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. కేంద్రం నుంచి ఇలాంటి సానుకూల నిర్ణయం వెలువడటం వల్ల మార్కెట్లు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా రైతులు ఆందోళనతో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తదు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు మేలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అదనపు ధాన్యం సేకరణ ప్రక్రియ, గడువు తదితర అంశాలపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

# ప్రభుత్వ విప్‌లకు మంత్రి హోదా.. తెలంగాణ సర్కార్ ఉత్తర్వులు

ఈ జాబితాలో ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశంలు ఉన్నారు. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం, ఈ ముగ్గురు నాయకులకు 'స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్'లోని ఆర్టికల్-18 కింద రాష్ట్ర మంత్రికి వర్తించే అధికారిక మర్యాదలు, ప్రోటోకాల్ సౌకర్యాలు లభిస్తాయి. ఇకపై వీరికి కేబినెట్ మంత్రులతో సమానమైన గౌరవం, ప్రాధాన్యత దక్కుతాయి. ఈ నిర్ణయం వారి బాధ్యతలకు మరింత బలాన్ని చేకూర్చడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో వారి పాత్రను బలోపేతం చేయనుంది. ఈ ముగ్గురు నేతలు మార్చి 18వ తేదీ నుంచే ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు స్వీకరించినట్లు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, వీరికి కల్పించిన రాష్ట్ర మంత్రి హోదా, సంబంధిత ప్రోటోకాల్ అధికారాలు కేవలం వారు ప్రభుత్వ విప్‌లుగా పదవిలో ఉన్నంత కాలం మాత్రమే వ్యక్తిగతంగా వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. పదవీకాలం ముగిసిన తర్వాత ఈ హోదా వర్తించదని జీవోలో స్పష్టత ఇచ్చింది. తమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు మంత్రి స్థాయి హోదా దక్కడం పట్ల చింతకుంట విజయ రమణారావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశంల మద్దతుదారులు, స్థానిక కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడటం, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు శాసనసభలో ప్రభుత్వ వాణిని బలంగా వినిపిస్తున్నందుకే వారికి ఈ గౌరవం దక్కిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పాలనాపరమైన అనుభవం, అసెంబ్లీలో పనితీరును పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నియామకాలతో సభలో ప్రభుత్వ విప్ బాధ్యతలు మరింత పటిష్ఠంగా అమలవుతాయని, పార్టీ ఎమ్మెల్యేల మధ్య సమన్వయం పెరుగుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# విద్యార్థులు, రాహుల్‌కు మద్దతుగా ప్రతి రోజు నిరసనలు

బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ వేలాది మంది యువత ఆందోళన బాట పట్టారని చెప్పారు. ఆందోళనకు దిగిన వారిని దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ నివాసాన్ని ముట్టడిస్తే.. ఆయన్ని కూడా అరెస్ట్ చేశారని అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని.. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీకి మద్దతుగా మంగళవారం హైదరాబాద్ - ముంబై నేషనల్ హైవే ముట్టడించామన్నారు. బుధవారం నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ చేశామని చెప్పారు. గురువారం కూడా ఆందోళన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బ్లాక్ టీషర్ట్‌లు ధరించిన వెయ్యి మంది కాంగ్రెస్ కేడర్‌తో ఈ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాహుల్, ప్రియాంకలతోపాటు విద్యార్థులకు మద్దతుగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. రాహుల్ గాంధీ ఆందోళన చేసినన్ని రోజులు సంగారెడ్డిలో ఆందోళనలు జరుగుతూనే ఉంటాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో సమృద్ధి వర్షాల కోసం కొత్తకొండలో వరుణయాగం

హనుమకొండ జిల్లా కొత్తకొండలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వరుణయాగం, యజ్ఞయాగాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 108 కలశాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కాకతీయుల కాలం నాటి భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయం మహిమగల క్షేత్రమని, ఈ ప్రాంత ప్రజలకు అపారమైన విశ్వాసం ఉన్న దైవమని తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. ల్ నినో పరిస్థితుల కారణంగా వర్షాలపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, భగవంతుడిపై విశ్వాసంతో తెలంగాణ వ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా బోనాల ఉత్సవాల సందర్భంగా అక్కడి దేవాలయాల్లోనూ మంచి వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వరుణయాగం రాష్ట్రానికి శుభఫలితాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నన్ను దెబ్బతీసేందుకు బీఆర్‌ఎస్, బీజేపీల కుట్ర

కాంగ్రెస్‌కు ఓటేసిన వారి ఓట్లను తొలగిస్తూ కొడంగల్‌లో కుట్రలకు తెరలేపారని, ఆ కుట్రదారులకు స్థానిక ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 'ఓటు లేని మనిషి సజీవంగా ఉన్నా చనిపోయినవారితో సమానం' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే అవకాశం కోల్పోతారని హెచ్చరించారు. కొడంగల్‌లో ఇప్పటికే 78 శాతం ఎస్‌ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని, ప్రతి ఒక్కరూ ఈ ఫారమ్ నింపి తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులతో కలిసి కొడంగల్ వీధుల్లో నిర్వహించిన ధర్నా ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

## సెల్ఫీల మోజులో ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు

ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆమె, అక్కడి నుంచే పర్యాటకుల భద్రతను ఉద్దేశించి ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దట్టమైన అడవులు, గోదావరి జలాలు, బొగత జలపాతం, రామప్ప దేవాలయం, మేడారం వంటి చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి అందాలకు ములుగు కేరాఫ్ అడ్రస్ అని ఆమె పేర్కొన్నారు. పర్యాటకులు ఇక్కడికి వచ్చి సంతోషకరమైన జ్ఞాపకాలతో సురక్షితంగా తిరిగి వెళ్లాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. అయితే, ఇటీవల కొందరు యువకులు ఉత్సాహంతో నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోవడం పట్ల మంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ, పోలీసు శాఖలు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటవద్దని ఆమె హెచ్చరించారు. ప్రమాదకరమైన జలపాతాలు, వేగంగా ప్రవహించే వాగులు, కొండచరియల వద్ద కేవలం సెల్ఫీలు, వీడియోల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. పర్యాటకులు అధికారుల సూచనలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే పర్యటన సురక్షితంగా, ఆనందంగా ఉంటుందని సీతక్క గుర్తుచేశారు.

## బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్

కరీంనగర్‌లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కార్యాలయం ఎదుటే బైఠాయించి కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపాయి. ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళనను నిరసిస్తూ బీజేపీ గాంధీభవన్ ముట్టడికి పిలుపునివ్వడం, దానికి ప్రతిగా కాంగ్రెస్ నేతలు బండి సంజయ్ ఆఫీస్ వైపు రావడం ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు రెండు చోట్లా భారీగా మోహరించారు. మరోవైపు గాంధీభవన్ ముట్టడికి యత్నించిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టుల సందర్భంగా బీజేపీ శ్రేణులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీజేపీ కార్యకర్తలు నిరసనకు దిగారు. రాజధాని హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో ఒకే రోజు జరిగిన ఈ పోటాపోటీ ఆందోళనలు, అరెస్టులు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర వేడిని రాజేశాయి.

## ట్రాన్స్‌కో డీఈ ఇంట్లో ఏసీబీ దాడులు..

తెలంగాణ ట్రాన్స్‌కోలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ)గా విధులు నిర్వహిస్తున్న ముత్యం వెంకటరమణ లక్ష్యంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు చేపట్టారు. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈరోజు తెల్లవారుజాము నుంచే ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఏసీబీకి చెందిన ఎనిమిది ప్రత్యేక బృందాలు మొత్తం 14 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. హైదరాబాద్ హైటెక్ సిటీలోని మీనాక్షి స్కై లాంజ్‌లో గల వెంకటరమణ నివాసంతో పాటు, ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లు మరియు కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఆదాయ వనరులకు మించి ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ దాడులు ప్రారంభించినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ఈ సోదాల్లో భాగంగా అధికారులు కీలకమైన ఆస్తి పత్రాలు, బ్యాంకు లావాదేవీల వివరాలు మరియు ఇతర దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తనిఖీలు పూర్తయిన తర్వాత స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం మరియు ఆస్తుల పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. విద్యుత్ శాఖాధికారిపై జరిగిన ఈ దాడులు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

## గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. గిగ్ వర్కర్లు, డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్‌ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## మహిళాలోకానికి స్ఫూర్తి ముత్తులక్ష్మి

మొదటివారు అని వివిధ రంగాల్లో పేర్కొన్న వ్యక్తులు చాలామంది ఉంటారు. కానీ అనేక రంగాల్లో మొదటివారిగా పేర్కొనగలవారు అరుదుగా ఉంటారు. మన దేశంలో తొలి శాసన సభ్యురాలు, పురుషుల వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన తొలి మహిళ, సర్జరీ విభాగంలో ప్రవేశం పొందిన తొలి భారతీయ మహిళ, సోషల్ వెల్ఫేర్ బోర్డు తొలి చైర్‌పర్సన్, శాసనసభకు తొలి ఉపాధ్యక్షురాలు, మద్రాసు మున్సిపల్ కార్పొరేషన్ తొలి మహిళా కార్పొరేటర్. ఇన్ని ప్రత్యేకతలు సాధించిన స్త్రీమూర్తి డా. ముత్తులక్ష్మిరెడ్డి. ఈమె తల్లి చంద్రమాళ్‌... దేవదాసి. ఆమెను పెళ్లి చేసుకున్నందువల్ల తండ్రి నారాయణస్వామిని వెలివేశారు. 1986 జూలై 30న జన్మించిన ముత్తులక్ష్మి ఈ వివక్షతల మధ్యే పెరిగారు. చిన్నతనం నుంచి దేవదాసి వ్యవస్థ, బాల్య వివాహాలు, పురుషాధ్యికత, ఒంటరి మహిళల వేదనలు ఆకళింపు చేసుకున్నారు. మహిళలకు ప్రవేశంలేని రోజుల్లో పుదుక్కోట రాజు తొండమాన్ సహకారంతో వైద్య కళాశాలలో చేరి, పురుష విద్యార్థులకు కన్పించకుండా ఏర్పాటు చేసిన పరదాల మధ్య కూర్చుని విద్యాభ్యాసం పూర్తిచేసి 1912లో వైద్యురాలయ్యారు. దేవదాసి కుటుంబం నుంచి వచ్చిన తల్లి... కూతురికి భద్ర జీవితం కోసం చిన్న వయస్సులోనే పెళ్లి చేయాలనుకుంది. కానీ తండ్రీకూతుళ్లు పడనివ్వలేదు. వివాహ బంధానికి దూరంగా ఉండాలనుకున్న ముత్తులక్ష్మి.. తన ఆశయాలకు ఆటంకం కల్గించదని నమ్మకం కుదిరిన తర్వాత, డా. టి.సుందరరెడ్డిని 1914లో వివాహం చేసుకున్నారు. 1947 అక్టోబర్ 8న మద్రాసు శాసనసభలో సహచర సభ్యులు రామసామిరెడ్డితో కలిసి దేవదాసీ నిర్మూలన చట్టం కోసం తీర్మానం పెట్టారు. దాన్ని సనాతనవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. చర్చ అనంతరం చివరకు దేవదాసీ నిర్మూలన చట్టాన్ని శాసనసభ ఆమోదించింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న కోస్తా రాయలసీమల్లోని 'మాతమ్మ', 'జోగినీ' వ్యవస్థలు, మలబార్ ప్రాంతాలలోని 'నంగా', కన్నడ ప్రాంతంలోని 'బసవ' లాంటి అనాగరిక వ్యవస్థలన్నీ రద్దయ్యాయి. ఈ కాలంలోనే బాలికల వివాహ వయస్సు 16 సంవత్సరాలకు పెంచాలని శాసనసభలో చర్చ పెట్టటమే గాక గాంధీకి ఉత్తరం రాశారు. బాలికల విద్య, వైద్యం, వితంతు వివాహాల ప్రోత్సాహం లాంటి వివిధ సామాజిక అంశాలపై విశేషంగా కృషి చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, క్యాన్సర్ రోగుల సేవ, ఆ వ్యాధికి వైద్యం విషయాల్లో ఆమె కృషి అద్వితీయం. మద్రాసులోని అడయార్‌లో 1954లో 12 పడకలతో ఆమె ప్రారంభించిన క్యాన్సర్ వైద్యశాల ఈ రోజుకీ 600 పైగా పడకలు కలిగి, ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలు కలిగిన వైద్యశాలగా విలసిల్లుతున్నది. ఈ వైద్యశాలకు 1952లో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. ఇప్పుడు సంవత్సరానికి 80వేలకు పైగా రోగులకు ఈ ఆసుపత్రి వైద్యసేవలు అందిస్తున్నది. 1931లో అడయార్‌లోనే 'అవ్వై హోం' పేరిట ఆమె స్థాపించిన శరణాలయం మహిళలు ఆత్మగౌరవంతో స్వతంత్రంగా బతికేట్లుగా తోడ్పడుతోంది. ఇన్ని వ్యాపకాల మధ్య ఆమె 'స్త్రీ ధర్మ' అనే పత్రిక నడిపింది. 1930లో లండన్‌లో, 1932లో చికాగోలో ప్రపంచ మహిళా సాధికారిక సదస్సుల్లో పాల్గొని భారతీయ మహిళల స్థితిగతుల్ని ప్రపంచానికి చాటారు ముత్తులక్ష్మి. అఖిల భారత మహిళా సదస్సుకు 1931లో ఆమె అధ్యక్షత వహించారు. 'శాసన సభలో నా అనుభవాలు', 'స్వీయ జీవిత చరిత్ర' ఆమె చేసిన రచనలు. కానీ అవి అందుబాటులో లేవు. 1968 జూలై 22న జీవితం చాలించిన డా. ముత్తు లక్ష్మిరెడ్డికి 1956లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ ఇచ్చినా, ఆమె సేవల ముందు అది చాలా చిన్నదే.

## ఉద్యమసారథి దాశరథి

పందొమ్మిదేండ్ల వయస్సు గల ఒక యువకుడు ఆవేశంతో నవాబు సైనికులు తెలంగాణ ప్రజానీకంపై జరుపుతున్న భయంకరమైన హింసా చర్యల్ని హృదయవిదారకంగా ఒక సభలో వర్ణిస్తూ మధ్య మధ్య తాను రచించిన కొన్ని పద్యాలను చదవడం ప్రారంభించాడు. ఆయనే దాశరథి. సభ్యుల్ని ఉర్రూతలూగిస్తూ ప్రేక్షకుని వలె గాక ప్రజల కష్టనిష్ఠూరాలలో తానొకడుగా కలసిపోయినాడు. అందుచేతనే దాశరథి 'అగ్నిధార'లో అణుమాత్రమైనా కాల్పనికత గానీ, అవాస్తవికత గానీ కనిపించదు. తెలంగాణ ప్రజల స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రతిబింబం దాశరథి కవిత్వం. జాతీయ భావాలతో నిండి విప్లవాత్మకమై విలసిల్లిన దాశరథి రచనలు నిద్రాణమై ఉన్న తెలంగాణ ప్రజానీకాన్ని మేల్కొల్పడానికి ఎంతో తోడ్పడతాయి. దుర్మార్గుల కిరాతకాలకు లోనైన పీడిత ప్రజానీకపు వాణి దాశరథి కంఠంలో ప్రతిధ్వనించింది. తన మాతృభూమి తెలంగాణను చూచుకొని మురిసిపోయి "నను గని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ" అని పొంగిపోయారు. మహారణ్యమైన తెలంగాణ భూమిని మాగాణ మొనర్చిన రైతుదేగాని తెలంగాణము, నిజాం నవాబుది కాదని సింహగర్జన చేశారు దాశరథి. తెలంగాణలో 'సమర సాహిత్యం' ఆరంభమైంది. క్రూరాతిక్రూరమైన నవాబు పరిపాలనకు వ్యతిరేకంగా ధైర్యంతో దాశరథి కలం చిందులు తొక్కింది. "దిగిపొమ్మని జగత్తంత/ నగారాలు కొడుతున్నది/ దిగిపోవోయ్ తెగిపోవోయ్/ ఇదే మాట ఇదే మాట/ పదేపదే అనేస్తాను" అని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎలుగెత్తి నిజాం నవాబును శపించాడు దాశరథి. 1948, జనవరి 11న సాయంత్రం నిజామాబాద్ జైల్లో రాజకీయ ఖైదీలు ఆహారం కోసం బారకాసుల నుంచి బయటకు వచ్చినప్పుడు అనేకమంది రజాకార్లు మారణాయుధాలతో జైలులోకి ప్రవేశించి వారిపై దాడి చేశారు. చాలామంది ఖైదీలకు గాయాలయ్యాయి. వారు ప్రాణరక్షణార్థం బారకాసుల్లోకి పారిపోయారు. కానీ దాశరథి రజాకార్ల చేతికి చిక్కి, విపరీతంగా దెబ్బలు తిని నిర్జీవంగా పడిపోయారు. మిగతావారంతా దాశరథి చనిపోయాడని భావించారు. మరునాటి ఉదయానికి వారికి వొళ్లు తెలిసింది. నిజానికి దాశరథికి అది పునర్జన్మే. ఆ తరువాత ఆయనను హైదరాబాద్ సెంట్రల్ జైలుకు పంపివేశారు. పోలీసు చర్య జరిగిన తరువాత ఇతర రాజకీయ ఖైదీలతో పాటు దాశరథికి కూడా విముక్తి లభించింది. వారి త్యాగం ఫలించింది.

# కాక్రోచ్ దండు కదను తొక్కిన వేళ..







'చరిత్ర గమనాన్ని మార్చడానికి గొప్ప శక్తులు అవసరం లేదు. తమ లక్ష్యంపై మొక్కవోని విశ్వాసంతో రగిలిపోతున్న దృఢ సంకల్పం గల కొద్దిమంది వ్యక్తుల సమూహం కూడా మార్పును సాధ్యం చేయగలదు 'అని మహాత్మాగాంధీ అన్నారు. భారతదేశం ఇప్పుడు ఒక అనిర్వచనీయ మార్పు దిశగా సాగుతున్నట్లు కనపడుతోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నెల రోజులుగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కార్యకర్తలు సోమవారం దేశ రాజధానిలో వర్షాకాల సమావేశాల తొలి రోజు పార్లమెంటును ముట్టడించడం ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న ఒక బృహత్పరిణామం అని చెప్పక తప్పదు. నాలుగంచెల బారికేడ్లు ఏర్పాటు చేసి, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్పీఎఫ్, ఢిల్లీ, త్రిపుర పోలీసు బలగాలను పెద్ద ఎత్తున మోహరించినా, మెట్రో స్టేషన్లను మూసివేసినా, ఇంటర్నెట్ దిగ్బంధనం చేసినా సరే.. వేల సంఖ్యలో ఉన్న కాక్రోచ్ దండు పార్లమెంటు గేట్ల వరకు దూసుకెళ్లింది. పోలీసులు చితకబాదుతున్నా యువతీ యువకులు తెగింపు ప్రదర్శించారు. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో గాయాలతో పడి ఉన్న యువతీ యువకులే సోమవారం నాటి దమనకాండకు ప్రత్యక్ష సాక్షులు. ఒక దశాబ్దానికి పైగా ప్రతిపక్షాలు ఎన్ని దాడులు, విమర్శలు చేసినా చలించని మోదీ ప్రభుత్వం బొద్దింకల తిరుగుబాటు ఉదంతంతో ఆత్మరక్షణలో పడ్డట్లు స్పష్టమవుతోంది. కాక్రోచ్ పార్టీ ప్రారంభించిన ఉద్యమంలో ఎంతమంది పాల్గొన్నారు అన్నది ముఖ్యం కాదని, దాని ప్రభావం ఎంత మేరకు ఉన్నది అన్నదే ముఖ్యమని బీజేపీ ఎంపీ ఒకరు చెప్పారు. 'మా నాన్న బీజేపీలో అతి ముఖ్యమైన నాయకుడు. అయితే సంభవిస్తున్న పరిణామాలు అంత ఆరోగ్యకరంగా లేవు..' అని జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్న ఒక యువకుడు అన్నారు. 'రాజకీయ నాయకులు విఫలమైన చోట పిల్లలే ప్రశ్నిస్తారు..' అని ఒక విద్యార్థి అన్నారు. నిజానికి కాక్రోచ్ జనతా పార్టీ ఒక సంస్థ కాదు. దేశ వర్తమాన చరిత్రలో దిక్కుతోచని యువతీ యువకుల సమూహమది. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు వచ్చినవారు కానీ, ఊరేగింపులో పాల్గొన్నవారు కానీ ఎవరో డబ్బులిచ్చి పిలిస్తే వచ్చినవారు కాదు. వారి రాక కోసం ఎవరూ బస్సులు, రైళ్లు ఏర్పాటు చేయలేదు. కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చే వారిని ఢిల్లీకి బయలుదేరేలా చేసింది. కేవలం నీట్ ప్రశ్న పత్రాల లీక్‌కు మాత్రమే రగిలిపోతూ వారు రాలేదు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా నిరుద్యోగం, చాలీచాలని జీతాలు, వ్యవస్థలో లోపాలు, రాజకీయ పార్టీల కుతంత్రాలను చూసి విసిగిపోయినవారే ఆ వచ్చిన యువతీయువకులు. జంతర్ మంతర్ ధర్నా స్థలానికి వచ్చిన వారికి ఒక లక్ష్యం అంటూ ఏమీ లేదు. 14--28 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువతను లెఫ్ట్, రైట్ అనే సిద్ధాంతాల మూసలో ఇమడ్చలేము. ఎమర్జెన్సీ వారి అనుభవంలో లేదు. ఒకప్పుడు ప్రతిపక్షాలను ఏకం చేసిన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ గురించి వారికి తెలియదు. మండల్, కమండల్ ఉద్యమాల అనుభవం సైతం వారికి లేదు. మూడు దశాబ్దాల క్రితం జరిగిన సంఘటనల జ్ఞాపకాలు వారికి లేవు. వర్తమాన సమస్యలతో సతమతమవుతూ తాము ఏమి చేయాలో తేల్చుకోలేక, భవిష్యత్తు అగమ్యగోచరమై, రకరకాల ప్రశ్నలతో వచ్చినవారు.. వారు ఏ సంప్రదాయక సూత్రాలకూ కట్టుబడి లేరు. తామే ప్రశ్నలు వేసుకుంటూ, తామే జవాబులు ఇచ్చేందుకు గడచిన నాలుగు వారాలుగా ఈ ధర్నా వేదిక వారికి ఉపయోగపడింది. ఆ నిరసన గురించి సోషల్ మీడియాలో విశేషంగా ప్రచారమయింది. మూడు వారాలకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై యువత ఎంత ఆందోళన చెందిందో ప్రత్యామ్నాయ మీడియా సాధనాల్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. ప్రతిపక్షాలకు విశ్వసనీయత లేదని, అందుకే తమకు ప్రత్యామ్నాయం అంటూ ఏమీ లేదని, తాము ఏమి చేసినా చెల్లుతుందని విశ్వసించిన మోదీ సర్కార్.. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావాన్ని తక్కువ అంచనా వేసినట్లే కనిపిస్తోంది. సాగునీటి చట్టాలపై రైతులు, పౌరసత్వ సవరణ చట్టంపై ముస్లింలు సుదీర్ఘకాలం చేసిన నిరసన ప్రదర్శనలను మోదీ ప్రభుత్వం అవలీలగా ఎదుర్కోగలిగింది. తమపై జరిగిన అత్యాచారాల్ని ప్రశ్నించిన మహిళా మల్లయోధుల ఆక్రందననూ ఆలకించలేదు. దేశంలో ఏ ఉద్యమం జరిగినా దాని విశ్వసనీయతను దెబ్బతీసేందుకు రకరకాల మార్గాలను అవలంబించింది. ఆందోళనకారులను రకరకాల పేర్లతో దుయ్యబట్టింది. ఇప్పుడు పోటెత్తిన యువత ఆందోళనను శాంతిభద్రతల సమస్యగా భావించి, దాన్ని అణచివేస్తే సరిపోతుందని మోదీ సర్కార్ భావించింది. కాక్రోచ్ పార్టీ నిరసన ప్రదర్శన తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చాను తొలగించి ఆయన స్థానంలో ఇప్పటి వరకూ స్పెషల్ డైరెక్టర్ (ఇంటెలిజెన్స్)గా ఉన్న అనురాగ్ కుమార్‌ను నియమించారు. జమ్మూ--కశ్మీర్ డెస్క్ ఇన్‌చార్జిగా ఆయన.. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను విచ్ఛిన్నం చేయడంలో కీలకపాత్ర పోషించారు. అలాంటి వ్యక్తి అదే మనస్తత్వంతో యువతీ యువకుల ఆందోళనను అణచివేసే ప్రయత్నం చేయడంలో ఆశ్చర్యం లేదు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా నిర్భయ అత్యాచారానికి వ్యతిరేకంగా యువతీ యువకులు వీధుల్లోకి వెల్లువెత్తారు. అయితే నాడు సోషల్ మీడియా ఇప్పుడున్నంత ప్రభావవంతంగా లేదు. సోషల్ మీడియా ఇవాళ ప్రజలకు ప్రత్యామ్నాయ మీడియాగా మారిందనడంలో సందేహం లేదు. నిజానికి మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీ ఐటీ సెల్ ప్రజలను సంఘటితం చేసేందుకు, ముఖ్యంగా హిందువుల భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు రకరకాల ప్రచారాలు చేసింది. ముఖ్యంగా వాట్సాప్ యూనివర్సిటీలను అధికంగా ఉపయోగించుకుంది. ఇప్పుడు జెన్ జీ తరం చేతుల్లో ఉన్న సోషల్ మీడియా ముందు ఆ ఐటీ సెల్ ప్రచారాలు వెలవెలబోతున్నట్లు కనిపిస్తోంది. ఏ ప్రచారమైనా ప్రజల మనోభావాలకు తగ్గట్లు లేకపోతే ఎక్కువ కాలం నిలబడదని ఈ పరిణామం రుజువు చేస్తోంది. మోదీ ఏ వాగ్దానాలతో ప్రజల ముందుకు వచ్చారో ఆ వాగ్దానాలు తెరమరుగుకావడం, భావోద్వేగ అంశాలే ప్రధాన అజెండాగా మారడం, నేటి తరం గమనించకపోలేదు. ఉద్యోగాలు కల్పించకపోవడం సరే, కనీసం పరీక్షల్ని సవ్యంగా నిర్వహించలేకపోవడం, నాణ్యమైన విద్యను అందించలేకపోవడం, అధికారమే పరమావధిగా అనేక కుతంత్రాలకు, అధర్మ యుద్ధాలకు పాల్పడడాన్ని వారు నిశితంగా గమనిస్తున్నారు. అయినప్పటికీ ప్రతిపక్షాలను, ముఖ్యంగా కాంగ్రెస్‌ను నేటి తరం నెత్తికెక్కించుకుంటోందని చెప్పడానికి ఆధారాలు ఏవీ లేవు. ఒక దశాబ్దకాలంగా కాంగ్రెస్, ఇతర పార్టీలు మోదీ పట్ల ప్రజా వ్యతిరేకత రగిలించడంలో విఫలమయ్యాయన్నది సందేహాతీత వాస్తవం. అయితే ప్రతిపక్షాలు విఫలమైన చోట యువత బయలుదేరుతుందని ఎవరూ ఊహించలేదు. కాంగ్రెస్ పార్టీయే బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించి, యువత ఆకాంక్షల్ని ప్రతిఫలించి ఉంటే కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఉండేది కాదు. మోదీని ఎదుర్కోవడంలో విఫలమైన అనేక శక్తులు ఇప్పుడు కాక్రోచ్ దండులో కనపడడం ఆసక్తికరమైన విషయం. విచిత్రమేమంటే పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజు ప్రభుత్వం ప్రవేశపెట్టదలుచుకున్న బిల్లుల గురించి కానీ, ప్రతిపక్షాలు లేవనెత్తదలుచుకున్న సమస్యల గురించి కానీ జనం పట్టించుకోలేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన 'చలో సంసద్' పిలుపునకే ఎంతో ప్రాచుర్యం లభించింది. ఒక రకంగా ఈ పరిణామం ప్రభుత్వ అస్తిత్వాన్నే కాదు, ప్రతిపక్షాల అస్తిత్వాన్ని కూడా ప్రశ్నార్థకం చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ ధర్నాపై ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు యువతపై లాఠీచార్జి జరగడం గురించి గగ్గోలు పెట్టడం కానీ, ప్రధానమంత్రి నివాసం ఎదుట రాహుల్‌గాంధీ ధర్నా చేయడం కానీ కాంగ్రెస్ తన అస్తిత్వాన్ని నిరూపించుకోవడంలో భాగమే. కాక్రోచ్ జనతా పార్టీ అనుభవంతోనైనా కాంగ్రెస్ బలమైన ప్రతిపక్షంగా పునరుత్థానం చెందుతుందా లేదా అన్నదానికి కాలమే సమాధానం చెబుతుంది. మోదీకి కూడా ప్రతిపక్షం ఎంతో కొంత ఉనికిలో ఉండడమే శుభప్రదం. లేనిపక్షంలో కాక్రోచ్ జనతా పార్టీలాంటివి మరిన్ని పుట్టే అవకాశాలున్నాయి. నైతిక బాధ్యత అన్నది నేటి కాలంలో ఒక వినకూడని అపశబ్దంగా మారింది. బడ్జెట్ లీక్ అయినందుకు మొత్తం మంత్రివర్గంతో రాజీనామా చేయించిన ఎన్టీఆర్ వంటి నేతలు కానీ, రైలు, విమాన ప్రమాదాలకు బాధ్యత వహించి రాజీనామా చేసే మంత్రులు కానీ నేడు లేరు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అస్తమానం ఎన్నికల్లో పార్టీ గెలిచేందుకు ఉపయోగించుకున్నప్పుడు ఆయన తన మంత్రి పదవీ బాధ్యతలపై ఎలా దృష్టి సారించగలరు? బిహార్, హరియాణా, బెంగాల్‌లో బీజేపీ గెలిచేందుకు సమర్థంగా వ్యూహరచన చేసిన ధర్మేంద్ర ప్రధాన్... తన మంత్రిత్వ శాఖను సమర్థంగా నిర్వహించని మాట నిజమే. అయితే ఆ తప్పు పూర్తిగా ఆయనది కాదు. ఎన్నికల్లో తమ పార్టీ గెలవడమే జీవన్మరణ సమస్యగా భావించి, అన్ని శక్తియుక్తులను ఆ దిశగా మళ్లించడమే ధర్మేంద్ర ప్రధాన్ లాంటి నేతల వైఫల్యానికి కారణం. ఇప్పటికైనా జరిగిన తప్పులకు బాధ్యత వహించడానికి, వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం పెంచడానికి మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందా?

# ఈ నెల 24,25 తేదీల్లో 'యంగ్ ఎర్త్ లీడర్స్' రెండు రోజుల పర్యావరణ శిక్షణ కార్యక్రమం

**-పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**-కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి పిలుపు**

హంసకలం వార్త

విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన, బాధ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మరియు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో ఎంపిక చేసినప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఈ నెల 24,25 తేదీల్లో రెండు రోజుల పాటు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమాన్ని తొర్రూర్ వందేమాతరం ఫౌండేషన్ నితిన్ భవన్ లో నిర్వహించనున్నట్లు కౌన్సిలింగ్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ ఇటీవల మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్‌ను జిల్లా కలెక్టర్ శశాంక అధికారికంగా ప్రారంభించారు.జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటగా,అనంతరం వారికి యంగ్ ఎర్త్ లీడర్లకు బ్యాడ్జీలను ప్రదానం చేసి పర్యావరణ పరిరక్షణకు నాయకులుగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారన్నారు.యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో ఔషధ మొక్కల తోట,కిచెన్ గార్డెన్,వాటర్ హార్వెస్టింగ్ పిట్,కంపోస్ట్ పిట్ ల ఏర్పాటుతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించాంని,గత రెండేళ్లుగా ఉమ్మడి వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో కాకతీయ వన చైతన్య యాత్రతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు.వాటి కొనసాగింపుగానే భవిష్యత్ తరాలను ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్‌ను చేపట్టినట్లు వివరించారు. ఈ శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం,వాతావరణ మార్పులు,గాలి,నీరు,నేల కాలుష్య నివారణ,ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,మొక్కల ప్రాధాన్యత,ప్రకృతి సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత వంటి అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించనున్నారు.అలాగే నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యత,బృంద నిర్వహణ నైపుణ్యాలపై కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఎంపికైన యంగ్ ఎర్త్ లీడర్స్ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.



# రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు అందించాలి

హంసకలం వార్త




ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ, అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి ఆయన వ్యవసాయ, నీటి పారుదల, ఆర్.డబ్ల్యూ.ఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల వారీగా పంటల సాగు వివరాలు, తాగునీటి సరఫరా తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ రైతులు ఏ రకం పంటలు వేశారన్నది పరిశీలించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇంకనూ పంట విత్తుకోని రైతులు తక్కువ నీటి అవసరం అయ్యే ఆరుతడి పంటలు, ఆకు కూరలు, పందిరి కూరగాయల సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అన్నారు. వర్షాభావ పరిస్థితుల గురించి ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని, తేమ నీటితో సాగయ్యే పంటల గురించి వారికి తెలియజేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు ఎంతో మేలు అని, ఈ దిశగా రైతులు ముందుకు వచ్చేలా చూడాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 6500 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు అవుతోందని, ఈ సంవత్సరం మరో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగు జరిగేలా లక్ష్యం మేరకు కృషి చేయాలని అన్నారు. వివిధ రకాల పంటల సాగు కోసం అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. నేల స్వభావాన్ని బట్టి అనుకూలమైన పంటలు వేసుకునేందుకు వీలుగా భూసార పరీక్షలు జరిపించి, వాటి వివరాలు రైతులకు తెలుపాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని హితవు పలికారు. అదేవిధంగా జిల్లాలో ఎక్కడ కూడా తా గునీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగానే కార్యాచరణ ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఆయా జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించాలని, నీటి వృథా జరగకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉట్నూర్ శాంతినగర్‌లో 'వజ్రం ప్యూర్ ఫైర్' శుద్ధ జల కేంద్రం ప్రారంభించిన

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**-ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**

హంసకలం వార్త



గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.బుధవారం ఉట్నూర్ మండలం లోని శాంతినగర్‌లో 'నంది ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన"వజ్రం ప్యూర్ ఫైర్"శుద్ధ జల కేంద్రాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తో కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి శుద్ధ జల కేంద్రాలను నెలకొల్పడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ ఆర్ఓ ప్లాంట్‌లో ఐయోనైజేషన్ వంటి అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో విభిన్న దశలలో నీటిని శుద్ధి చేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజలకు స్మార్ట్ కార్డుల ద్వారా 20 లీటర్ల క్యాన్లలో రక్షిత మంచినీరు సులభంగా అందుబాటులోకి రానుందని చెప్పారు. కేవలం బోరు నీటిని శుద్ధి చేయడమే కాకుండా,ప్లాంట్ నుండి వచ్చే వ్యర్థ నీటిని సమీపంలోని ప్రభుత్వ వసతి గృహాల వినియోగానికి మళ్లించడం ఎంతో మంచి పరిణామమని ప్రశంసించారు.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఎంతగానో మేలు చేస్తాయని, రాబోయే 20 నుండి 30 రోజుల వరకు పంటలకు నీటి కొరత ఉండదని హర్షం వ్యక్తం చేశారు.అయితే వర్షాల అనంతరం ఎండలు కాసే అవకాశం ఉన్నందున డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలంతా ముందస్తు జాగ్రత్తగా ప్రతి శుక్రవారం తప్పనిసరిగా "డ్రై డే"పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే మాట్లాడు తూ...ఈ శుద్ధ జల కేంద్రం దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా స్థానిక ప్రజలు, అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహణ బాధ్యతలను చూడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఋత్విక్ సాయి కోటే,ఎంపీడీఓ రాయిస్‌ఉద్దీన్, నంది ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక సర్పంచ్ అనిత, మహిళా సమాఖ్య సభ్యులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌ఎంఎంఎస్ (NMMS) పరీక్షకు ఆన్ లైన్ లోనే దరఖాస్తులు

**-ఆగస్టు 24వరకు దరఖాస్తులు పూర్తి చేయాలి**

**-జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్**

హంసకలం వార్త

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (NMMS) పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ వరకు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్షకు హాజరుకావాలనుకునే విద్యార్థులు http://bse.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా నిర్దేశిత గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.ఆన్‌లైన్ నమోదు అనంతరం దరఖాస్తు ఫారం, ఎన్ఆర్ (రెండు కాపీలు), ఎస్‌బీఐ కలెక్ట్ ఫీజు రసీదు ప్రింటెడ్ కాపీలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధృవీకరించి సెప్టెంబర్ 1, 2026లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలని తెలిపారు. ధృవీకరణ లేకుండా వచ్చిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తమ కుల ధృవీకరణ పత్రాల ధృవీకరించిన ప్రతులను తప్పనిసరిగా జతచేయా లని, దివ్యాంగ (PH) అభ్యర్థులు వైద్య ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని సూచించారు. సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించని పక్షంలో వారిని జనరల్ అభ్యర్థులుగా పరిగణిస్తామని తెలిపారు.అదే విధంగా ప్రతి అభ్యర్థి ఆదాయ ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా జతచేయాలని, లేనిపక్షంలో దరఖాస్తు రద్దు చేయబడుతుందని తెలిపారు.ఎన్ఎంఎంఎస్ పరీక్షను 2026 డిసెంబర్ 1న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని డిఇఓ రమేష్ కుమార్ కోరారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయండి...!

**-శాసనసభ్యులు ఆది శ్రీనివాస్**



హంసకలం వార్త

వేములవాడ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు సీఆర్ఆర్, ఎంఆర్ఆర్, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్, డీఎంఎఫ్‌టీ, ఈజీఎస్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పని సకాలంలో పూర్తై అందుబాటులోకి రావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు

# ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



హంసకలం వార్త

జగిత్యాల జిల్లా రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గుల్లపేట గ్రామంలో గ్రామపంచాయతీ భవనం నిర్మాణ పనులను, అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను తనిఖీ చేశారు. భవన నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలతో చేపట్టాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా అన్ని సౌకర్యాలతో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న పల్లె దవాఖాన నూతన భవనం మరియు వీవో భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దావఖానా భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీవో భవనాలను అన్ని మౌలిక వసతులతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న ప్రతి ప్రభుత్వ భవనం దీర్ఘకాలం ఉపయోగపడేలా నిర్మించాలని, పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ షాదాబ్ హకీం, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, , స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో విద్యార్థులను, రాహుల్ గాంధీ ని అడ్డుకోలేరు

**-దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్**



హంసకలం వార్త

చిన్నచింతకుంట మండలం లాల్ కోట ఐ తీక్షుం రాయి చూర్ హైవేపై దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ.జి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ....నీట్ (NEET-UG) పేపర్ లీక్ వ్యవహారానికి వ్యతిరేకంగా, ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని మరియు విచక్షణారహితంగా విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని, టియర్ గ్యాస్ ప్రయోగించడానికి నిరసిస్తూ పెద్ద ఎత్తున నిరసన (ధర్నా) కార్యక్రమం నిర్వహించి, దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరియు మోడీ గారికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసిన కాంగ్రెస్ శ్రేణులు.అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..నీట్ (NEET) పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం అమానుషమని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా , ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ , కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు, నీట్ పరీక్షల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి గిరిప్రదక్షిణ

-పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



హంసకలం వార్త

ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం నాడు నిర్వహించిన గిరి ప్రదర్శనలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు ఈ సందర్భంగా ముందుగా స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేలాది మంది భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ పూర్తి చేసి, కొండపై ఉన్న ప్రధాన ఆలయానికి చేరుకుని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, స్వాతి నక్షత్రం రోజున శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.యాదగిరిగుట్ట దేవస్థానం రాష్ట్రంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకుంటోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ గిరిప్రదక్షిణలో ఆంధ్రప్రదేశ్ మాజీ ఎంపీ గొరంట్ల మాధవ్ , పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు, అర్చకులు, అలాగే వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## వెజ్ నాన్ వెజ్ మార్కెట్‌ను పరిశీలించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



హంసకలం వార్త

నగరంలో నూతనంగా నిర్మించిన వెజ్--నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు అంతస్తులతో ఆధునిక సదుపాయాలతో ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వెజిటబుల్ మార్కెట్‌ను ఏర్పాటు చేసి, మొదటి అంతస్తులో నాన్ వెజ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా పరిశుభ్రమైన వాతావరణంలో తాజా కూరగాయల కొనుగోలు--అమ్మకాలు జరగడంతో పాటు, నాన్ వెజ్ విక్రయాలు కూడా సక్రమంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. త్వరలోనే ఈ వెజ్--నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మార్కెట్ అందుబాటులోకి వస్తే నగర ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా, వ్యాపారులకు కూడా మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. అంతకుముందు ఆయన నిర్మాణ పనులను సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, కార్పొరేటర్లు చిన్నా, రఘు, రామస్వామి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి ‘స్త్రీ నిధి’ చేయూత

-జిల్లా కలెక్టర్ రాజర్షిషా

హంసకలం వార్త



గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, వారి సాధికారతకు ‘స్త్రీ నిధి’ రుణాలు ఎంతో దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్’ జిల్లా సమీక్షా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం రుణాల వినియోగానికే పరిమితం కాకుండా, చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి మహిళా సంఘానికి సకాలంలో రుణాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా స్త్రీ నిధి ద్వారా అందించిన ఆర్థిక సహాయం, రుణాల పంపిణీ, రికవరీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా సమీక్షించారు. అధికారులు, ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మహిళల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్‌డిఓ రవీందర్, మెప్మా పిడీ రాజు, స్త్రీ నిధి జిల్లా ప్రతినిధులు, మండల సమాఖ్య ప్రతినిధులు,స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో విద్యాసామర్థ్యాలు మెరుగుపడాలి

-ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
-ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన డీఈఓ వాసంతి

హంసకలం వార్త



విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వాసంతి సూచించారు. పాల్వంచ పట్టణంలోని బొల్లూరుగూడెం ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె సందర్శించి శిక్షణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రాథమిక స్థాయిలో అమలవుతున్న మౌలిక భాషా, గణిత సామర్థ్యాల (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక రెమిడియల్ తరగతులు నిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలను పెంపొందించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తరగతి స్థాయికి అనుగుణంగా నిర్దేశించిన అభ్యసన ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.ప్రతి కాంప్లెక్స్ పరిధిలో మూడు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎఫ్ఎల్ఎన్ కాంపిటెన్సీ పాఠశాలలుగా ఎంపిక చేసినట్లు పేర్కొంటూ, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు శాతం వందకు వంద విద్యాసామర్థ్యాలు సాధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండెక్స్ (పీజీఐ)లో మరింత మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత ర్యాంకులు పొందేలా ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థి వివరాలను తప్పనిసరిగా యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ప్రభుత్వ విద్యా ప్రణాళికలకు యూడైస్ డేటా ప్రామాణికంగా ఉపయోగపడుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్)లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్దేశిత మెనూ ప్రకారం అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ పెంచాలని డీఈఓ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎ. శ్రీరామ్మూర్తి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సమృద్ధి వర్షాల కోసం కొత్తకొండలో వరుణయాగం

-భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

హంసకలం వార్త



హనుమకొండ జిల్లా కొత్తకొండలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వరుణయాగం, యజ్ఞయాగాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 108 కలశాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కాకతీయుల కాలం నాటి భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయం మహిమగల క్షేత్రమని, ఈ ప్రాంత ప్రజలకు అపారమైన విశ్వాసం ఉన్న దైవమని తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు.ఎల్ నినో పరిస్థితుల కారణంగా వర్షాలపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, భగవంతుడిపై విశ్వాసంతో తెలంగాణ వ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా బోనాల ఉత్సవాల సందర్భంగా అక్కడి దేవాలయాల్లోనూ మంచి వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ యాగం రాష్ట్రానికి శుభఫలితాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్ లో మరో భారీ దోపిడి

-అర్ధరాత్రి దొంగల బీభత్సం

హంసకలం వార్త



కరీంనగర్ పట్టణ నడిబొడ్డున మరో భారీ దోపిడీ జరిగింది. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలో గల భగత్ నగర్ లో నివాసం ఉంటున్న అజ్మత్ అలీ అనే వృద్ధుడి ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో వృద్ధుడు ఇంట్లోకి అగంతుకులు చొరబడి మారుణాయుధాలతో దాదాపు 8 మంది మాస్కులు గ్లౌజులతో ఇంట్లోకి చొరబడి దోపిడికి పాల్పడ్డారు. అర్ధరాత్రి సమయంలో అజ్మత్ అలీ ఇంటి సందులోని లైట్ ఆఫ్ చేసి ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో ఆయన నోటిని మూసివేసి అతని పై దాడి చేశారు ముగ్గురు మహిళల నోట్లో గుడ్డలు కుక్కి తుపాకులతో బెదిరించి 66 తులాల బంగారం,10 తులాల వెండి,రూ. 22 లక్షల నగదు దోచుకెళ్లారు.ఈ క్రమంలో దోపిడీని ప్రతిఘటించిన అజ్మత్ అలీ పై దాడి చేశారు ఘటన స్థలంలో ఒక తుపాకీ లభ్యమైంది దానిని పరిశీలించగా అది బొమ్మ తుపాకీగా తేలింది. దోపిడికి వచ్చిన వారంతో హిందీలో మాట్లాడుతున్నారని బాధితులు చెప్తున్నారు. ఇదంతా కూడా సంఘటన జరిగిన సమీప చుట్టుపక్కల పరిసర ప్రాంతాల మీద అవగాహన ఉన్నవారు లేదా బంధువుల మధ్యలో ఉండొచ్చని అనుమానం వ్యక్తం అవుతుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దోపిడి అనంతరం దుండగులు అజ్మత్ అలీ ఇంట్లో అద్దెకు ఉండే వారి రెండు బైకులు చోరీ చేసుకుని బైపాస్ రోడ్డు మీదుగా వరంగల్ పరారయ్యారని సిసి ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. దీనిని బట్టి చూస్తే ఇంటికి దుండగులు ఏలా చేరుకున్నారు. ఏదైనా వాహనంలో వచ్చారా లేదా అజ్మత్ అలీ ఇంటి సమీపంలో వాహనం దిగి వాహనాన్ని ఎక్కడైనా దూరంలో పార్క్ చేసి ఉంచారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి.

-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.

హంసకలం వార్త

వయోవృద్ధుల సంక్షేమ చట్టాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని, వయోవృద్ధుల శాఖ, రెవిన్యూ, పోలీస్ సమన్వయంతో వయోవృద్ధుల మెయింటెనెన్స్ యాక్ట్ అమలును పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు, మెయింటెనెన్స్ యాక్ట్ అమలు పర్యవేక్షణ తదితర అంశాలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు తమ పిల్లలనుండి పరిహారం కోరుతూ వచ్చిన దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో 15 రోజులకు ఒకసారి సమీక్షించాలని ఆదేశించారు. ఇదివరకే ఆర్డీవో కార్యాలయం నుండి మెయింటెనెన్స్ ఉత్తర్వులు జారీ అయి ఉన్న తల్లిదండ్రులకు ప్రతినెలా పిల్లల సొమ్ము అందుతున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని అన్నారు. వయోవృద్ధుల మెయింటెనెన్స్ ఇతర అంశాలకు సంబంధించి మండల స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ కమిటీలో సిడిపిఓ, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ తదితర అధికారులను నియమించాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ కమిటీ వయోవృద్ధుల కేసుల స్థాయిని పరిశీలించాలని, మెయింటినెన్స్ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్డీవో జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం తల్లిదండ్రులకు ప్రతినెలా మెయింటెనెన్స్ ఇవ్వని వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వయోవృద్ధుల ఫిర్యాదులు పరిష్కరించేందుకు కౌన్సిలింగ్, మెయింటెనెన్స్ ఉత్తర్వులు తదితర చర్యల అనంతరం సమస్యలు పరిష్కారం కానిపక్షంలో తదుపరి చర్య కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫారసు చేయాలన్నారు. వయోవృద్ధుల కేసులకు సంబంధించి తీసుకున్న చర్య పై పోలీసు శాఖ ప్రతి 15 రోజులకు ఒకసారి యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రుల మెయింటినెన్స్ విషయంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్, ఆర్ డి ఓ లు శర్మిల, జల కుమారి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్, సిడిపిఓలు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# వీబీజీ రామ్ జీ ద్వారా నీటి సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
-ఆగస్టు 1 నుంచి పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోరు రీఛార్జ్ నిర్మాణ పనులు ప్రారంభించాలి
-సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకుని భవిష్యత్తును కాపాడాలి
-తెలంగాణ జలసిరి, వీబీజీ రామ్ జీ అమలు పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

హంసకలం వార్త




సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలను పరిరక్షించడం అత్యంత ప్రాధాన్యమని, తెలంగాణ జలసిరి కార్యక్రమం, వీబీజీ రామ్ జీ పథకం ద్వారా నీటి సంరక్షణ నిర్మాణాలను గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి కార్యక్రమం, వీబీజీ రామ్ జీ పథకం అమలు పై ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో చేపట్టాల్సిన నీటి సంరక్షణ పనులు, స్థలాల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభంపై అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీ రామ్ జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు సంబంధించిన నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో పంట కుంటలు, ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన స్థలాలను వెంటనే గుర్తించి, పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, ఆగస్టు 1వ తేదీ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టే విధంగా నీటి సంరక్షణ చర్యలను మిషన్ మోడ్‌లో అమలు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నీటి సంరక్షణ నిర్మాణాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులు నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీలు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్,డి.ఆర్.డి.ఓ. కాళిందిని,జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలి

-వర్షాభావంలో శాస్త్రీయ యాజమాన్యంతో పంటలను కాపాడాలి
-పోడు రైతులపై ప్రత్యేక దృష్టి... ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం చేయాలి
-వ్యవసాయ అధికారులు,కేవీకే శాస్త్రవేత్తలతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా జూమ్ సమీక్ష

హంసకలం వార్త



జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శాస్త్రీయ సాగు విధానాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, పంటలను నష్టాల నుంచి కాపాడే ఒదుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఎరువుల సరఫరా,ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయడంతో పాటు పోడు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశి ంచారు.కలెక్టరెట్ నుండి జిల్లా వ్యవసాయ అధి కారులు,మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు,కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలతో నిర్వహించిన జూమ్ సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామగోపాల్ వర్మ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను వివరించారు.రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా అన్ని ఎరువుల దుకాణాల్లో తగిన నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే టోకెన్ లేదా ముందస్తు నమోదు విధానాన్ని అమలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని చెప్పారు.పోడు రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని,భూ వివాదాలు లేని అర్హులైన రైతులకు రైతు భరోసా వర్తించేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి, నమోదు పూర్తికాని మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో రైతులకు ప్రభుత్వ పథకాలు,శాస్త్రీయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జూలై 20తో పత్తి విత్తనాల గడువు ముగిసినందున ఇకపై పత్తి విత్తకూడదని శాస్త్రవేత్తలు సూచించారు.ఇప్పటికే వేసిన పత్తి పంటలో ఖాళీలు ఉంటే 7 నుంచి 10 రోజుల్లోపు పూరించాలని, వర్షాభావ పరిస్థితుల్లో ఫోలియర్ స్ప్రే ద్వారా పోషకాలు అందించాలని తెలిపారు.సోయాబీన్, కంది, మొక్కజొన్న పంటల్లో కలుపు, తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మందులనే వినియోగించాలని సూచించారు. మొక్కజొన్న పంటను జూలై 31 వరకు విత్తుకోవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో అంతరకృషికి ప్రాధాన్యం ఇవ్వాలని, యూరియా వినియోగాన్ని పరిమితం చేసి అవసరమైన చోట నానో యూరియా, నానో డీఏపీ లేదా 19-19-19 ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు.డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడంతో పాటు,భవిష్యత్తులో వర్షాభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యవసాయ కుంటలు, కందకాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.కేవీకే శాస్త్రవేత్తల సూచనలను ప్రతి గ్రామంలోని రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు వ్యవసాయ సంబంధిత సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ హెల్ప్‌లైన్ 8977742855ను సంప్రదించాలని సూచించారు.

# ఇంటింటికి నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలన

-ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలి
-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

హంసకలం వార్త



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో ఇంటింట నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయగా, ఫారాలను కూడా ఈ ఆగష్టు 3వ తేదీలోపు సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని ప్రజలను కోరారు.ప్రజలకు ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.కొంతమంది ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని, వేరే ప్రాంతాలకు మారారని లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్ఓల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఫారాలు సమర్పించకుండా ఎలాంటి స్పందన ఇవ్వకపోతే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రతి అర్హ ఓటరు ఆగష్టు 3వ తేదీలోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ షాదాబ్ హకీం, బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల చెంతకు యూనియన్ బ్యాంక్

-డిజిటల్ లావాదేవీల పై అప్రమత్తంగా ఉండాలని అవగాహన
-వినియోగదారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు సలహాలు, సూచనలు



హంసకలం వార్త

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్ నగర్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో కస్టమర్ సర్వీస్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాగర్ కర్నూల్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.విరిత ఆధ్వర్యంలో “షాప్ టు షాప్” వినియోగదారుల సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా ఎల్డీఎం చంద్రశేఖర్ పాల్గొని వినియోగదారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖల మేనేజర్లు, అధికారులు, క్లరికల్, సబార్డినేట్ సిబ్బంది వ్యాపార సంస్థలు, దుకాణాలను ప్రత్యక్షంగా సందర్శించి వినియోగదారుల అవసరాలను తెలుసుకున్నారు.వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక పరిష్కారాలపై అవగాహన కల్పిస్తూ వివిధ బ్యాంకింగ్ ఉత్పత్తులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా పొదుపు, కరెంట్ ఖాతాలు, వ్యక్తిగత, గృహ, ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, బీమా, పెట్టుబడి పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. సురక్షితమైన, సులభమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని వినియోగదారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించిందని, వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు పనిచేస్తున్నామని యూనియన్ బ్యాంక్ సిబ్బంది పేర్కొన్నారు. వారితోపాటు డీబీహెచ్ అంగ్షుమాన్ దాస్, అసిస్టెంట్ మేనేజర్ షేక్ ఆయేషా సుల్తానా, సిఎస్ఏలు ఎం. శ్రీలేఖ, కె. అనూష, సిబ్బంది లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



హంసకలం వార్త

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సి.ఐ. రవీందర్ తో కలిసి సందర్శించి భద్రతా చర్యలలో భాగంగా సి.సి. కెమెరాల ఏర్పాటు, భోజనశాల, వంటశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... బాలికల భద్రత దృష్ట్యా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని,ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ బి.పి.సి.విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా బోధన నాణ్యత పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు.ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని,అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు,యువత సహకారం తీసుకోవాలని తెలిపారు.భూభారతి, సాదా బైనమా,రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.మందమర్రి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ సతీష్ కుమార్,బెల్లంపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ,భూభారతి, సాదా బైనమా,రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూభారతి, సాదా బైనమా,రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కాసిపేట మండల తహసిల్దార్ సునీల్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి కాసిపేట ప్రాంతంలో సింగరేణి నూతన ఓపెన్ కాస్ట్ కొరకు స్థల పరిశీలన చేశారు.తాండూర్ మండల తహసిల్దార్ జ్యోత్స్న,సింగరేణి సంస్థ గోలేటి ఏరియా జనరల్ మేనేజర్ లతో కలిసి తాండూర్ ప్రాంతంలో స్థల పరిశీలన చేశారు.ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
గురువారం 23 జూలై 2026

# బిజినెస్

## భారత్‌లో ఐఫోన్ 17దే హవా
## యాపిల్ అమ్మకాలలో 44 శాతం వాటా



భారత్‌లో 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో యాపిల్‌కు చెందిన ఐఫోన్ 17 సిరీస్ అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్‌గా నిలిచింది. ఈ సిరీస్ ఒక్కటే కంపెనీ మొత్తం ఐఫోన్ సరఫరాల్లో 44 శాతం వాటాను దక్కించుకున్నట్లు సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) వెల్లడించింది. సీఎంఆర్ నివేదిక ప్రకారం.. ఐఫోన్ 16 సిరీస్ 40 శాతం వాటాతో రెండో స్థానంలో నిలిచింది. ఇక ఐఫోన్ 17ఈ 6 శాతం, ఐఫోన్ 16ఈ 5 శాతం, ఐఫోన్ 15 సిరీస్ 4 శాతం షిప్‌మెంట్‌లను నమోదు చేశాయి. కొత్త మోడళ్లు వచ్చినప్పటికీ ఐఫోన్ 15 సిరీస్‌కు ఇంకా మార్కెట్‌లో ఆదరణ కొనసాగుతున్నట్లు నివేదిక పేర్కొంది. ఐఫోన్ 18 సిరీస్ విడుదలకు ముందు ఏప్రిల్-జూన్ త్రైమాసికం సాధారణంగా యాపిల్‌కు మందగమన కాలమని, ఈసారి మెమరీ చిప్‌ల కొరత కూడా షిప్‌మెంట్లపై ప్రభావం చూపిందని సీఎంఆర్ విశ్లేషించింది. అయితే పండగల సీజన్‌లో యాపిల్ మళ్లీ జోరు పెంచే అవకాశం ఉందని అంచనా వేసింది. కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్ విడుదలతో అమ్మకాలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొంది. 2026 చివరి నాటికి భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో యాపిల్ వాటా 12 శాతానికి, ట్యాబ్లెట్ మార్కెట్లో 30 శాతానికి చేరే అవకాశముందని సీఎంఆర్ అంచనా వేసింది.

## క్లెయిమ్ చేయని ఎల్ఐసీ, ఈపీఎఫ్ నిధులు ఇతర అవసరాలకు వాడబోం: కేంద్రం




ఎల్ఐసీలో క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయిన నగదు, ఈపీఎఫ్ఓలోని నిర్వీర్య (ఇనాపరేటివ్) ఖాతాల్లో ఉన్న నిధులను ఇతర అవసరాలకు వినియోగించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారమే ఈ నిధులను నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. 2024 జూన్ 19న ఐఆర్‌డీఏఐ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. పదేళ్లకు పైగా క్లెయిమ్ చేయని బీమా మొత్తాలను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫండ్ (ఎస్‌సీడబ్ల్యూఎఫ్)కు బదిలీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2026 మార్చి 31 నాటికి ఎల్ఐసీలో మొత్తం రూ.7,318.50 కోట్లు క్లెయిమ్ చేయని నిధులు ఉన్నాయని వెల్లడించారు. ఇందులో పాలసీదారులకు చెందిన రూ.5,564.55 కోట్లు, వాటిపై వచ్చిన ఆదాయం రూ.1,753.95 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈపీఎఫ్ఓలో క్లెయిమ్ చేయని ఖాతాలు ఏవీ లేవని, అయితే లావాదేవీలు లేక నిర్వీర్యంగా మారిన ఖాతాల్లో రూ.9,330.56 కోట్లు ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ఈ నిధుల అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందించేందుకు ఎల్ఐసీ, ఈపీఎఫ్ఓ ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని వివరించింది. ఎల్ఐసీ తన వెబ్‌సైట్ ద్వారా క్లెయిమ్ చేయని మొత్తాలను తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు ఎస్ఎంఎస్‌లు, లేఖలు, ఏజెంట్లు, బీమా సఖీల ద్వారా పాలసీదారులు, నామినీలను సంప్రదిస్తోందని ప్రభుత్వం తెలిపింది. మరోవైపు ఆధార్‌తో అనుసంధానమైన రూ.1,000లోపు నిర్వీర్య ఈపీఎఫ్ ఖాతాలను ఆటోమేటిక్‌గా సెటిల్ చేసే పైలట్ ప్రాజెక్టును కూడా ఈపీఎఫ్వో ప్రారంభించినట్లు వెల్లడించింది.

## ఆరు వారాల గరిష్ఠానికి ముడి చమురు- 95 డాలర్లు దాటిన బ్రెంట్ క్రూడ్



అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గత ఆరు వారాల్లో తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును అధిగమించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా సంబంధిత ఆందోళనలు, మారుతున్న డిమాండ్ పరిస్థితులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాలు, ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తిలో సర్దుబాట్లు చేయడం వంటివి ధరల పెరుగుదలకు దారితీశాయి. ఇది చమురు మార్కెట్లలో మళ్లీ అస్థిరతను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండటంతో, ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది. దీనికి తోడు యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీకి సంబంధించిన నౌకలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించడంతో, ఆయిల్ ట్యాంకర్లు తమ రవాణా మార్గాలను మార్చుకుంటున్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇంధనం దిగుమతులపై ఆధారపడిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇది సవాలుగా మారనుంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు ప్రభుత్వాలు,పారిశ్రామిక వర్గాలు మార్కెట్ కదలికలను నిశితంగా గమనిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఒపెక్ం దేశాలు తీసుకోబోయే నిర్ణయాలు, అంతర్జాతీయ ఆర్థిక సంకేతాలపై చమురు ధరల గమనం ఆధారపడి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## గిల్‌కు 70 పరుగుల వద్దే కండరాలు పట్టేస్తున్నాయి: స్టువర్ట్ బ్రాడ్

ఇంటర్నెట్ డెస్క్:

భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫిట్‌నెస్‌పై ఇంగ్లండ్ క్రికెట్ దిగ్గజం స్టువర్ట్ బ్రాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో గిల్ బ్యాటింగ్‌తో అదరగొట్టినప్పటికీ.. కీలక సమయంలో కండరాలు పట్టేయడంపై ప్రశ్నలు లేవనెత్తాడు. 70 పరుగుల చేసిన తర్వాతే గిల్‌కు క్రాంప్స్ ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదని వెల్లడించాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భారత్ 1-2తో ఓడిపోయినప్పటికీ, గిల్ బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్‌ల్లో రెండు అర్ధ సెంచరీలు సాధించాడు. అయితే తొలి, మూడో వన్డేల్లో 70 పరుగుల మార్కు దాటిన తర్వాత అతడికి క్రాంప్స్ సమస్య ఎదురవ్వడం గమనార్హం.ప్రతిసారి శుభ్‌మన్ గిల్ 70 పరుగుల మార్క్ దాటగానే క్రాంప్స్‌తో ఇబ్బంది పడుతున్నాడు. తొలి, మూడో వన్డేల్లో అతని రిథమ్ దెబ్బతింది. అయితే గిల్ వన్డే గణాంకాలు అద్భుతం. బర్మింగ్‌హామ్‌లో అతని రికార్డును తెరపై చూసినప్పుడు సగటు దాదాపు 60గా కనిపించింది. మొదట నమ్మలేక మరోసారి చూసుకోవాల్సి వచ్చింది. అది 10 మ్యాచ్‌ల్లో సాధించిన రికార్డు కాదు.. ఇన్ని మ్యాచ్‌ల తర్వాత కూడా అదే స్థాయిలో ప్రదర్శన కనబరచడం గొప్ప విషయం' అని బ్రాడ్ ప్రశంసించాడు. 26 ఏళ్ల గిల్ ఇప్పటివరకు 67 వన్డేల్లో 3,379 పరుగులు చేశాడు.




**-నాకు ఆశ్చర్యంగా అనిపించింది: బట్లర్**

గిల్‌తో పాటు ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడే ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ కూడా ఈ విషయంపై స్పందించాడు. 'తొలి వన్డేలో గిల్‌కు క్రాంప్స్ వచ్చాయని శ్రేయస్ అయ్యర్ నాకు చెప్పాడు. ఇంగ్లండ్ వాతావరణంలో ఇలా జరగడం ఆశ్చర్యంగా అనిపించింది. ఇది అహ్మదాబాద్‌లోని 40 డిగ్రీల వేడి కాదు. బహుశా ఏదైనా అంతర్గత గాయం ఉండొచ్చు. లార్డ్స్‌లో కీలక సమయంలో అతని వేగాన్ని తగ్గించి, వికెట్ కోల్పోయేలా చేసింది' అని బట్లర్ పేర్కొన్నాడు.

## టీమిండియాను వెంటాడుతున్న గాయాలు
## సమన్వయ లోపమే కారణమా?

ఇంటర్నెట్ డెస్క్:

భారత జట్టును కొంతకాలంగా గాయాల బెడద వెంటాడుతోంది. ఇటీవల ఇంగ్లండ్ పర్యటన నిరాశాజనకంగా ముగిసిన అనంతరం వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా ప్లేయర్ల గాయాలపై బహిరం గంగానే అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆటగాళ్ల ఫిట్‌నెస్, వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ విషయంలో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ , జట్టు యాజమాన్యం, సపోర్ట్ స్టాఫ్ మధ్య సరైన సమన్వయం లేకపోవడమే దీనికి కారణమని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. ఇటీవల ప్లేయర్లు తరచూ గాయాల పాలవుతున్నారు. ఇది చూస్తుంటే కొందరు ఆటగాళ్లు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించక ముందే బరిలోకి దిగుతున్నట్లు కనిపిస్తోంది. ఆటగాడి ఫిట్‌నెస్ స్థితి, వర్క్ లోడ్‌కు సంబంధించిన విషయాల్లో సమన్వయం లోపించింది' అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి వెల్లడించారు. మెడికల్ మాజీ హెడ్ నితిన్ పటేల్ వెళ్లిపోయిన తర్వాత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఇప్పటికీ పూర్తి స్థాయి మెడికల్ హెడ్‌ను నియమించలేదని తెలుస్తోంది. 2023లో రూపొం దించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ లోనూ ఎలాంటి మార్పులు చేయలేదని సమాచారం.

**-తరచూ గాయపడుతున్న ప్లేయర్లు..**

వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా వంటి యువ ఆటగాళ్లు తరచూ గాయాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా నితీశ్ రెడ్డి ఇంగ్లండ్‌కు చెందిన బౌలింగ్ కోచ్ స్టెఫాన్ జోన్స్ పర్యవేక్షణలో తన బౌలింగ్ వేగాన్ని పెంచుకు నేందుకు ప్రయత్నించడం కూడా చర్చనీ యాం శమైంది. జట్టు అవసరాల దృష్ట్యా




ప్రతిసారీ మరింత వేగంగా బౌలింగ్ చేయాలనే ప్రయత్నం చేయడం వల్ల శరీరంపై అదనపు ఒత్తిడి పడుతోందని బీసీసీఐ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. వేగం పెంచే ప్రక్రియను దశలవారీగా అమలు చేయాల్సి ఉండగా, తొందరపాటు వల్ల గాయాల ప్రమాదం పెరిగిందని పేర్కొన్నాయి.

# క్రీడలు

## జింబాబ్వే సిరీస్.. టీమిండియాలో అవకాశం కోసం ఎదురుచూస్తున్నా: అశోక్ శర్మ




ఇంటర్నెట్ డెస్క్:

భారత టీ20 జట్టులో చోటు దక్కడంతో తన జీవితకాల కల నెరవేరిందని యువ పేసర్ అశోక్ శర్మ వెల్లడించాడు. జులై 23 నుంచి 26 వరకు టీమిండియా.. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్ ఆడనున్న సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌కు ఎంపికైన అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో అశోక్ శర్మ కూడా ఉన్నాడు. హరారే వేదికగా గురువారం తొలి మ్యాచ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అశోక్ శర్మ మాట్లాడాడు. భారత జెర్సీ ధరించి దేశానికి ప్రాతినిధ్యం చేయాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు. భారత జెర్సీ ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నా తొలి లక్ష్యం. ఆ క్షణం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. దేశవాళీ క్రికెట్‌లో ఇప్పటివరకు ఎలా కష్టపడ్డానో, అదే విధంగా నా ప్రణాళికలు, సాధనను కొనసాగిస్తాను. నా బలాలపైనే దృష్టి పెడతాను. అనవసరంగా కొత్త ప్రయోగాలు చేయను. జింబాబ్వే సిరీస్‌లో నాకు అవకాశం వస్తే దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటాను. ఎక్కువ మ్యాచ్‌లు ఆడి ఎక్కువ వికెట్లు తీయాలని ఉంది. ఆ తర్వాత వీలైనంత త్వరగా భారత టెస్టు జట్టుకు ఆడాలనేది నా తదుపరి లక్ష్యం' అని అశోక్ శర్మ పేర్కొన్నాడు.

**-ఇండియా-ఎ నుంచి జాతీయ జట్టుకు..**

గత జూన్‌లో శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇండియా-ఎ జట్టులో అశోక్ శర్మకు అవకాశం లభించింది. ఫీల్డింగ్ సమయంలో గాయపడిన యుద్వీర్ సింగ్ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకున్నారు. ఆ పర్యటనలో లభించిన అనుభవమే ఇప్పుడు జాతీయ జట్టులో చోటు దక్కడానికి ఉపయోగపడిందని భావిస్తున్నారు. తన బౌలింగ్‌కు అతిపెద్ద స్ఫూర్తి దక్షిణాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ అని అశోక్ వెల్లడించాడు. స్టెయిన్ ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని మార్చగల బౌలర్ అని ప్రశంసించాడు. 'డేల్ స్టెయిన్ బౌలింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అతని దూకుడు, రన్‌అప్, బ్యాటర్లను ఉచ్చులోకి దించే విధానం అన్నీ నాకు స్ఫూర్తినిస్తాయి. ఫాస్ట్ బౌలర్‌గా నేను అతడినే ఆదర్శంగా తీసుకుంటాను' అని అశోక్ శర్మ చెప్పుకొచ్చాడు.

# లోకేశ్ కనగరాజ్ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా పూజా హెగ్డే

## హ్యాట్రిక్ రిపీట్?



'పుష్ప' ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో భారీ క్రేజ్ సంపాదించుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తన తదుపరి ప్రాజెక్ట్‌లతో భారతీయ సినీ పరిశ్రమలో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయన లైనప్‌లో ఉన్న చిత్రాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో కోలీవుడ్ సంచలన దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ' AA23'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉండగానే, దీనికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్‌కు జోడీగా పూజా హెగ్డేను తీసుకోనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, అల్లు అర్జున్-పూజా హెగ్డే కాంబినేషన్‌లో ఇది మూడో చిత్రం అవుతుంది.

గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'దువ్వాడ జగన్నాథం','అల వైకుంఠపురములో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించాయి. ముఖ్యంగా త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన 'అల వైకుంఠపురములో' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడమే కాకుండా వారి మధ్య కెమిస్ట్రీ, 'బుట్టబొమ్మ' పాట దేశవ్యాప్తంగా సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఈ హిట్ పెయిర్ మళ్లీ కలిస్తే అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో 'రాకా' అనే పాన్





వరల్డ్ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ఆ తర్వాత లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో "ఊూ23' పట్టాలెక్కనుంది. లోకేశ్ తన సినిమాల్లో హీరో పాత్రలతో పాటు హీరోయిన్ పాత్రలను కూడా ఎంతో బలంగా, ప్రభావవంతంగా తీర్చిదిద్దుతారనే పేరుంది. ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే 'మోనికా' పాటలో కనిపించి అలరించడం కూడా ఈ ఊహాగానాలకు బలాన్నిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌ను లోకేశ్ తనదైన మార్క్ ఇంటెన్స్ యాక్షన్‌తో ఎలా చూపిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే, పూజా హెగ్డే ఎంపికపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతున్నప్పటికీ, చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అభిమానులు ఈ హ్యాట్రిక్ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## వారానికి 4 రోజులే పనా?.. భారతదేశానికి అది సాధ్యం కాదు: నటుడు విక్రాంత్ మాస్సే

ఉత్తర యూరప్ దేశాల్లో మాదిరిగా వారానికి నాలుగు రోజులే పనిచేసే 'ఫోర్-డే వర్క్ వీక్' నమూనా ప్రస్తుతానికి భారతదేశానికి అస్సలు సరిపడదని ప్రముఖ నటుడు విక్రాంత్ మాస్సే అభిప్రాయపడ్డారు. తన రాబోయే వెబ్ సిరీస్ 'ముసాఫిర్ కేఫ్' ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పనివేళలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై తన స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. మనది ఇంకా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, యువ ప్రతిభ కలిగిన ఈ ప్రజాస్వామ్య దేశం అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వచ్చే 40 నుంచి 50 ఏళ్ల పాటు ఎంతో కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.దముఖ్యంగా వినోద పరిశ్రమ గురించి మాట్లాడిన విక్రాంత్, సినీ నిర్మాణం అత్యంత వ్యయంతో కూడుకున్న వ్యవహారమని వ్యాఖ్యానించారు. షూటింగ్‌లో 12 గంటల షిఫ్ట్ ఉన్నప్పటికీ, నిజానికి కేవలం నాలుగు లేదా ఐదు గంటలు మాత్రమే కెమెరా ముందు పనిచేస్తామని వివరించారు. బడ్జెట్ పరిమితులు, ప్రాక్టికల్ పరిస్థితుల కారణంగా కొన్నిసార్లు 16 నుంచి 17 గంటలు కూడా పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. రుచిర్ అరుణ్ దర్శకత్వంలో మహిమా మక్వానా, వేదిక పింటోలతో కలిసి విక్రాంత్ నటించిన ప్రేమకథా చిత్రం 'ముసాఫిర్ కేఫ్' జులై 24న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదల కానుంది. ఇందులో చందర్ పాత్రలో తన నటన కొత్త భావోద్వేగాలను ఆవిష్కరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## దేశాన్ని అస్థిరపరిచే కుట్ర: ఢిల్లీ అల్లర్లపై సినీ నటుడు నరేశ్

ఢిల్లీలో జరిగిన 'ఛలో పార్లమెంట్' నిరసన కార్యక్రమంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై ప్రముఖ నటుడు నరేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. నిరసనకారులు బారికేడ్లను దాటుకుని పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడం, పోలీసులు అడ్డుకోవడంతో లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం వరకు వెళ్లిన పరిస్థితులపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనల పేరుతో వాహనాలు ధ్వంసం చేయడం, పోలీసులు, ఆందోళనకారులు గాయపడటం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ అనేది చాలా తీవ్రమైన అంశమని, ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి ఉండాల్సిందని నరేశ్ అభిప్రాయపడ్డారు. అయితే పరీక్షలు పూర్తై ఫలితాలు కూడా వచ్చాక ఇలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ ఘర్షణల్లో పోలీసు సిబ్బంది కూడా గాయపడటాన్ని చూస్తుంటే... దీని వెనుక దేశాన్ని అస్థిరపరిచే సంఘవిద్రోహ శక్తుల కుట్ర కోణం ఏమైనా ఉందా? అనే అనుమానాలు కలుగుతున్నాయని... ఈ అంశంపై సమగ్రంగా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే హింసకు పాల్పడటం లేదా యువతను తప్పుదోవ పట్టించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎప్పుడూ దేశ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం నరేశ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.



# 'ది ఈస్ట్ ప్యాలెస్' (నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!

కొరియన్ సినిమాలకు .. సిరీస్ లకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ వైపు నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. కొరియన్ కథల్లోని బలం .. సహజత్వం .. టేకింగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందువలన ఓటీటీ సెంటర్లలో కొరియన్ కంటెంట్ హవా నడుస్తోంది. అలా వచ్చిన సిరీస్ గా 'ది ఈస్ట్ ప్యాలెస్' కనిపిస్తోంది. నామ్ జూ హ్యూక్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ డార్క్ ఫాంటసీ సిరీస్ ను 8 ఎపిసోడ్స్ గా రూపొందించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది.అది ఒక అందమైన ప్యాలెస్. అక్కడ నుంచే ప్రిన్స్ 'క్రౌన్' తన పరిపాలన కొనసాగిస్తూ ఉంటాడు. అతనికంటే ముందున్న రాజుకి నలుగురు వారసులు ఉంటారు. వాళ్లంతా కూడా ఒకరి తరువాత ఒకరు చనిపోతారు. ఆ మరణాలు జరిగిన 30 ఏళ్ల తరువాత ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతూ ఉంటుంది. క్రౌన్ వారసులు ముగ్గురు







చనిపోతారు. నాల్గొవ కుమారుడు (యువరాజు) చావు బ్రతుకుల్లో ఉంటాడు. ఈ వరుస మరణాలకు కారణం 'కోనేటి దెయ్యం' అనే అంతా నమ్ముతుంటారు. 'గు - చోన్' ( నామ్ జూ హ్యూక్)కి చిన్నతనం నుంచే కొన్ని అతీంద్రియ శక్తులు వస్తాయి. అందువలన అతనికి దుష్టశక్తులను ఎదుర్కొనగలిగే శక్తి వస్తుంది. ఈ కారణంగా 'క్రౌన్' అతనిని పిలిపిస్తాడు. కోనేటి దెయ్యాన్ని అంతం చేసి, తన కొడుకుని బ్రతికిస్తే, అతను కోరినది ఇస్తానని చెబుతాడు. అసలు విషయాన్ని దాచేసి, 'వాస్తు నిపుణుడు'గా తన ప్యాలెస్ లో చెలామణి కావలసిందిగా ఆదేశిస్తాడు. ప్యాలెస్ కి దూరంగా పెరిగిన కూతురు (యువరాణి)ని పిలిచి, 'గు -చోన్'కి సహకరిస్తున్నట్టుగా ఉంటూ, అతనిని గమనించమని చెబుతాడు. యువరాణి .. గు - చోన్ ఇద్దరూ కూడా ఆ ప్యాలెస్ లో తిరుగుతూ, పరిస్థితులను పరిశీలించడం మొదలుపెడతారు. ఆ ప్యాలెస్ లో 'కోనేరు' చుట్టూ ఏదో రహస్యం ఉందని భావిస్తారు. అలాగే 'ఉప్పుగని' ప్రదేశంలోనే ప్రేతాత్మల హడావిడి ఎక్కువగా ఉండటాన్ని గమనిస్తారు. మంత్రించిన కుండల వెనుక మర్మం ఏదో ఉందని భావిస్తారు. యువరాజు ప్రాణాలకు హాని తలపెడుతున్న పిశాచిని గురించి కనుక్కోవడానికి 'గు-చోన్' ప్రయత్నిస్తూ ఉంటాడు. ఆ రాజభవనంలో తన తల్లిని హత్యచేసింది ఎవరనే అన్వేషణను యువరాణి కొనసాగిస్తూ ఉంటుంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449